మార్జిన్లే వారికి పార్కింగ్

మాది సెంట్రల్. మా ఇష్టం వచ్చిన చోట పార్కింగ్ చేస్తాం. మీరెన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదన్నట్లు వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తున్న ఆయిల్, గ్యాస్ కంపెనీల తీరు ఇటు ప్రజలకు, అటు పోలీసులకు తలనొప్పిగా మారింది. జి.కొండూరు మండల పరిధి విద్యానగరం, కట్టుబడిపాలెం, కొండపల్లి పరిధిలో జాతీయ రహదారే పార్కింగ్ స్థలంగా వందలాది లారీలను కిలో మీటర్ల పొడవునా నిలిపి నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న తీరుతో ప్రజలు విసిగెత్తిపోతున్నారు.

- ఆయిల్, గ్యాస్ కంపెనీలకు పార్కింగ్ స్థలాలు కరువు
- జాతీయ రహదారిపైనే నిలుపుతున్న భారీ వాహనాలు
- ట్రాఫిక్ సమస్యతో నిత్యం ప్రమాదాలు
- పోలీసులను సైతం లెక్కచేయని వైనం





ఎన్టీఆర్ కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై నిలిపిన భారీ వాహనాలు (ఇన్‌సెట్) విద్యానగరం వద్ద జాతీయ రహదారిపై నిలిపిన భారీ వాహనాలు

జి.కొండూరు: కట్టుబడిపాలెం, కొండపల్లి ఐడీఏలో ఉన్న బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలకు చెందిన 600 ట్యాంకర్లు, లారీలను విజయవాడ-భద్రాచలం 30వ నంబర్ జాతీయ రహదారిపై గంటల తరబడి నిలిపివేయడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని కంపెనీలకు పార్కింగ్ స్థలాలు లేకపోవడం, కొన్ని కంపెనీలకు పార్కింగ్ స్థలాలు ఉన్నప్పటికీ డ్రైవర్లు లారీలను రహదారిపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

రహదారిపై వాహనాల పార్కింగ్ విషయమై కొన్నేళ్లుగా కంపెనీల యజమానులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మీడియాలో కథనాలు వచ్చినప్పుడు మాత్రమే పోలీసులు చర్యలు చేపట్టి వదిలివేయడంతో మరలా అదే తీరు కొనసాగుతోంది. అయిల్, గ్యాస్ కంపెనీలకు పక్కనే ఉన్న కట్టుబడిపాలెం, విద్యానగరం, ఎన్టీఆర్ కాలనీకి చెందిన ప్రజలు రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కంపెనీల యజమానులకు, అధికారులకు చీమకుట్టినట్టైనా లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హెచ్చరికలు బేఖాతరు

జాతీయ రహదారిపై పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాల యజమానులు పోలీసుల హెచ్చరికలను సైతం లెక్కచేయడంలేదు. స్థానిక పోలీసులు వాహనాల యజమానులు, డ్రైవర్లకు పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చి, జరిమానాలు విధించినప్పటికీ మరలా అదే తీరు కొనసాగుతోంది. ఆయా కంపెనీల అధికారులైతే పోలీసుల హెచ్చరికలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదు.

విద్యార్థుల ఇక్కట్లు

కట్టుబడిపాలెం, ఎన్టీఆర్ కాలనీ, విద్యానగరం కాలనీలకు చెందిన విద్యార్థులు తరచూ ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చే వాహనాల కోసం జాతీయ రహదారిపైన వేచి ఉంటారు. ఆయిల్ కంపెనీలకు చెందిన లారీలు రహదారిపైన నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి విద్యార్థులు రోడ్డు దాటుతున్నప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జాతీయ రహదారిపై మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలు ఆయిల్ కంపెనీల వద్దకు రాగానే ట్రాఫిక్ ఎక్కువ ఉండడంతో ప్రమాదాలకు గురవుతున్నాయి.

ప్రమాదాలు జరుగుతున్నాయి



జాతీయ రహదారికి ఒక వైపు మా గ్రామం, మరో వైపు అయిల్, గ్యాస్ కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలలో లోడింగ్‌కు వచ్చే భారీ వాహనాలను రహదారిపైనే నిలుపుతున్నారు. ఈ విధంగా చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపైకి రావాలంటే భయపడాల్సి వస్తోంది.

– రమావతు శ్రీను నాయక్, గ్రామస్తుడు, కట్టుబడిపాలెం

గందరగోళంగా ఉంటుంది



మా గ్రామాన్ని ఆనుకొని ఉన్న జాతీయ రహదారిపై అయిల్, గ్యాస్ లారీలను నిలపడం వల్ల గందరగోళంగా ఉంటోంది. రహదారిపైకి భయం భయంగా రావాల్సి వస్తోంది. ఇక విద్యార్థులనైతే తల్లిదండ్రులు దగ్గరుండి రోడ్డు దాటించాల్సి వస్తోంది. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకుంటే సమస్య పరిష్కారమవుతుంది.

– దారావతు బాల దుర్గాప్రసాద్ స్వామి, గ్రామస్తుడు, కట్టుబడిపాలెం

కఠిన చర్యలు తీసుకోవాలి



జాతీయ రహదారిపై లారీలను నిలిపే వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. విద్యానగరం నుంచి కొండపల్లి ఐడీఏ వరకు కిలోమీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా గ్యాప్ లేకుండా వాహనాలను నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– కె బాలకృష్ణ, సీపీఎం నాయకుడు, జి.కొండూరు

క్లుప్తంగా

వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ



ఇబ్రహీంపట్నం: క్రిస్మస్ సందర్భంగా కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం రోజున పేదలు నిజమైన సంతోషం పొందాలని నూతన వస్త్రాలు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరు ఇతరులకు చేతనైన సహాయం చేయాలని సూచించారు. ప్రజలంతా క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ కార్యదర్శి ఎం.సుమలత, అబ్రహం, నాగరాజు, అనిల్, హరీష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): లయన్స్ క్లబ్ వీఆర్కే నగర మహిళ సంస్థ ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దే శేషగిరిరావు అన్నారు. కొండపల్లిలో ఆదివారం లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా వీఆర్కే నగర మహిళ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తిచేసిన 90 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 10 మంది పాఠశాల బాలికలకు సైకిళ్లు ఆయన పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ దేవినేని జోసీకుమారి, జిల్లా మాజీ గవర్నర్లు ఆంజనేయులు, ఉపేంద్ర, శంకర్‌గుప్తా, దేవినేని కిశోర్‌కుమార్, నివృతరావు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వెనిగళ్ల అమ్మాజీ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

‘హైందవ శంఖారావం’పై అవగాహన



తిరువూరు: విజయవాడలో జనవరి 5న జరుగనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని కమలానంద భారతిస్వామి కోరారు. తిరువూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం హైందవ సమ్మేళనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమలానంద భారతి స్వామిజీ దేవాలయాల ప్రాముఖ్యత, హిందూ ధర్మం గొప్పతనం, హిందువుల ఐక్యత ఆవశ్యకతను వివరించారు. హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ నవీన్ తిరువూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడిమెట్ల మురళి పాల్గొన్నారు. శ్రీనివాసాచారి, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కుందా వెంకటేశ్వరరావు, అన్నవరపు క్రాంతికుమార్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు



మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడులోని లంక భూముల్లో విద్యుత్ సదుపాయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఏఈ వెంకన్నబాబు అన్నారు. మూలపాడు ఆదిమవాస లంబాడీ ఫీల్డ్ కో–ఆపరేటివ్ సొసైటీ భూముల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. స్తంభాల ఏర్పాటుకు పాయింట్లను గుర్తించారు. సొసైటీ అధ్యక్షుడు బాణావత్ బాలాజీ సభ్యుల పేర్లతో విద్యుత్ శాఖకు పెట్టిన అర్జీలు, చెల్లించిన నగదు డిపాజిట్ చలానాలను ఏఈ పరిశీలించారు. లంక పొలాల్లో నూతన సర్వీసులు, విద్యుత్ లోడును బట్టి ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తామన్నారు. సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నూజివీడు: పట్టణానికి చెందిన చావా విజయశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యం చికిత్స నిమిత్తం కాపు కల్యాణ మండపం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పలువురు కమిటీ దృష్టికి తీసుకెళ్లగా రూ.13 వేల నగదును అందించారు. కమిటీ సభ్యులు టీవీ మల్లికార్జునరావు, కొల్లా శ్రీనివాస్, బండి కిశోర్, నీలం నాగేశ్వరరావు, మేకల అనిల్, మండా శ్రీనివాస్, తోట వెంకట్రావు, గుడిసేవ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

డెప్యూటీ కలెక్టర్‌గా మైలవరం తహసీల్దార్



బాలకృష్ణారెడ్డి

మైలవరం: మైలవరం తహసీల్దార్ గద్దం బాలకృష్ణారెడ్డి డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శనివారం ఉత్తర్వులు అందుకున్నారు. తహసీల్దార్‌గా మైలవరానికి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే తన పనితీరుతో అందరి మన్ననలను ఆయన పొందారని పలువురు ప్రశంసించారు. ఉద్యోగోన్నతి పొందిన తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి మైలవరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

జోగి రమేష్ పరామర్శ



ఇబ్రహీంపట్నం: రెడ్డిగూడెం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి అనారోగ్యానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ ఆదివారం వైద్యశాలకు వెళ్లి వెంకటరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న నేత్ర వైద్య శిబిరం

చాట్రాయి: భగవాన్ సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 26న పోలవరం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని ట్రస్టు అధ్యక్షుడు జె.రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో కంటి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

రావిచర్ల నల్లగట్టుపై అక్రమ తవ్వకాలు

- ప్రజల ఫిర్యాదుతో విచారణ
- పొక్లెయిన్ సీజ్



పొక్లెయిన్‌తో గట్టును తవ్వి వేస్తున్న దారి

నూజివీడు: మండలంలోని రావిచర్ల నల్లగట్టుపై తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ గట్టును ఆక్రమించుకునేందుకు గ్రామస్తులతో పాటు, ఇతర ప్రాంతాల వారు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. నల్లగట్టు పైకి వెళ్లేందుకు పొక్లెయిన్‌తో ఆదివారం దారి వేయడంతో పాటు చదును చేస్తుండటంతో గ్రామస్తులు పలువురు తహసీల్దార్ బీవీ సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ ఆర్ఐ అశోక్‌ను, వీఆర్వో రాజ్‌కుమార్‌ను నల్లగట్టు వద్దకు పంపగా పొక్లెయిన్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా నల్లగట్టును ఆక్రమించుకోవడమే కాకుండా పైకి దారి వేయాల్సిన పని ఏముందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మామిడి మొక్కలు వేసిన వారు వాటిని పెంచుకోవాలే గాని చదును చేయడం, పొక్లెయిన్‌తో తవ్వి గట్టుపైకి దారి వేయడం ఎందుకని పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ గట్టు.. చేతులు మారిన ఎస్సైన్‌మెంట్ పట్టాలు

నల్లగట్టు అనేది రెవెన్యూ గట్టు కాగా, దీనిని స్థానికులు ఆక్రమించి మామిడి మొక్కలు వేసుకొని సాగు చేసుకుంటున్నారు. దీంతో గతం నుంచి పలు ప్రభుత్వాలు ఆక్రమణదారులకు ఎస్సైన్‌మెంట్ పట్టాలు ఇచ్చింది. అయితే ఆ ఎస్సైన్‌మెంట్ పట్టా భూములను విక్రయించేస్తున్నారు. ఇలా ఈ భూములు ముగ్గురు, నలుగురి చేతులు మారాయి. ఈ నేపథ్యంలో ఈ గట్టు ఆక్రమణ విషయంలో వివాదం నెలకొంటుంది. అలాగే గట్టు కింది భాగంలో పట్టా భూమి ఉన్న వారు సైతం గట్టుపై వరకు ఆక్రమిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ గట్టును పూర్తి స్థాయిలో సర్వే చేసి ఎంత వరకు ఉందో సరిహద్దులు నిర్ణయిస్తే వివాదాలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సీఎస్ఐ చర్చిలో జగన్ జన్మదిన వేడుకలు



తోలుకోడు(మైలవరం): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మైలవరం మండలం తోలుకోడు గ్రామంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తోలుకోడు గ్రామం బుర్రి ప్రతాప్ యూత్ ఏర్పాటు చేసిన కేక్‌ను పాస్టర్ గంధం రవి కట్‌చేసి ప్రార్థనలు చేశారు. చర్చి పెద్దలు, గ్రామ పెద్దలు, మైలవాల ఏలేశ్వరరావు, గారపాటి షడ్రక్, వార్డు సభ్యులు రామాల వెంకటేశ్వరరావు, మిక్కిలి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

ఆగిరిపల్లి: ప్రేమ తత్వమే క్రీస్తు మార్గమని, ప్రతి ఒక్కరూ తోటి వారితో ప్రేమానురాగాలతో జీవనం సాగిస్తే సమాజానికి మేలు జరుగుతుందని సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్షులు రెవరెండ్ జి.ఇమ్మానుయేల్ అన్నారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లి పరిశుద్ధ పౌలు సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో రెవరెండ్ కె.ఐజక్‌జాన్ ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారితో ప్రేమానురాగాలతో జీవనం సాగిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. క్రీస్తు అనుసరించిన మార్గంలో నడిచిన వారికి శాంతి, సమాధానం కలుగుతుందన్నారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కొవ్వొత్తుల ప్రదర్శన, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాస్టర్లు రెవ. జె.ఆనందరావు, శామ్యూల్, భగవాన్ దాస్, ఆమోసు, విశ్వాసులు, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ మేనేజర్లు

ఇబ్రహీంపట్నం: ప్రతిభ ఆధారంగా ఉద్యోగావకాశాలు దక్కుతాయని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వీహెచ్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ముత్తవరపు కల్యాణ మండపంలో నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్‌మేళాను ఆదివారం ఆయన ప్రారంభించారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్లు అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపికైన వారికి శిక్షణ కాలంలో రూ.7 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే ఉండటం, ట్రైనింగ్ పిరియడ్ తర్వాత రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఉంటుందని చెప్పడంతో అనేక మంది జాబ్ మేళాపై ఆసక్తి కనబర్చలేదు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని తమ సంస్థ కార్యాలయానికి రావాలని చెప్పడంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుంటారనే భయం అభ్యర్థుల్లో నెలకొంది. జాబ్‌మేళాలో 970 మంది పాల్గొనగా 190 మంది ఎంపికైనట్లు వీహెచ్ఎస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. మరో 440 మందిని ఇంటర్వ్యూ చేయాల్సి ఉందన్నారు.

అసంపూర్తిగా పోలవరం–యడవల్లి రోడ్డు



పనులు నిలిచిన పోలవరం–యడవల్లి రోడ్డు




రోడ్డుకు శంకుస్థాపన చేసిన అప్పటి ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు (ఫైల్)

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 1.90 కోట్లు మంజూరు
- గత మార్చిలో రోడ్డు పనులకు శంకుస్థాపన
- ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిన పనులు
- రోడ్డు పనులు పూర్తి చేయాలని గ్రామస్తుల వినతి

చాట్రాయి: మండలంలోని పోలవరం నుంచి యడవల్లికి రెండు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు, గ్రామస్తులు ఏలూరు వెళ్లేందుకు ఇది దగ్గరిమార్గం. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ రోడ్డు పనులకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ 1.90 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసింది. ఏలూరు జిల్లా కేంద్రానికి పోలవరం నుంచి పాతిమాపురం అడ్డరోడ్డుకు వెళ్లాల్సి ఉండేది. దీనివల్ల పోలవరం నుంచి యడవల్లి మీదుగా ఏలూరు వెళ్లడానికి 20 కిలో మీటర్ల దూరం కలిసివస్తోంది. రోడ్డు నిర్మించాలని ప్రజలు అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు విన్నవించారు. ఆయన స్పందించి జిల్లా అధికారులతో సంప్రదించి రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించారు. గత మార్చిలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల ముందు రోడ్డు పక్కన ఉన్న జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. రోడ్డుపై పడిన గుంతలను పూడ్చే పనులు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిపి వేశారు. ఎన్నికల అనంతరం తిరిగి చిన్నపాటి పనులు ప్రారంభించి పనులు నిలిపి వేశారు. ప్రజలకు అవసరమయ్యే అభివృద్ధి పనులు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినా ఇలాంటి పనులు నెలల తరబడి నిలిచిపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఏలూరు వెళ్లడానికి సమయం ఆదా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మంత్రి పార్థసారథి సహకారంతో పోలవరం–యడవల్లి రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏలూరుకు దగ్గరి దారి



ఏలూరు ఆస్పత్రికి వెళ్లాలంటే చాలా దగ్గర దారి. పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలి. వ్యవసాయ భూముల్లోకి వెళ్లాలన్నా ఈ రోడ్డు రైతులకు చాలా ఉపయోగకరం.

–బిలుగుడి వేణు, పోలవరం, చాట్రాయి మండలం

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

పోలవరం–యడవల్లి రోడ్డు పనులు నిలిచిన మాట వాస్తవమే. పనులు ప్రారంభించాలంటూ కాంట్రాక్టర్‌కి నోటీసులు ఇచ్చాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

–రవికుమార్, పీఐయూ డీఈ

లక్ష తులసి దళార్చన

తిరువూరు: ధనుర్మాసం సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో ఆదివారం విశేష పూజలు జరిగాయి. రాజుపేట ఆంజనేయస్వామి ఆలయంలో లక్ష తులసి దళాలతో పూజాదికాలు నిర్వహించారు. కోదండ రామాలయంలో వెన్న చిలికే ఉత్సవం, వేంకటాచలస్వామి ఆలయంలో దదిమదన ఉత్సవం, వెన్న చిలికే ఉత్సవం సంప్రదాయ బద్ధంగా జరిపారు.



600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



ఆగిరిపల్లి: మల్లవల్లిలో ఆదివారం నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వై.ఈశ్వరయ్య, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: గ్రామంలోని శ్రీతిరుపతమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడం, పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేదదీరారు.

నేడు ‘మీకోసం’

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు సబ్ కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలను ఇస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ కనెక్షన్

చాట్రాయి: ఎస్సీ, ఎస్టీలకు ప్రధానమంత్రి హర్‌ఘర్ పథకం ద్వారా ఉచితంగా సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు కిలో వాట్ల విద్యుత్ వినియోగిస్తున్న వారు బ్యాంకు ఖాతా, కరెంటు బిల్లు, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్సులతో దరఖాస్తులను చాట్రాయిలోని తమ కార్యాలయంలో అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు.